

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



Contact Number
9059328777

ఆంధ్రప్రదేశ్ ( క్రిష్ణ) ఆదివారం 12-07-2026 సంపుటి: 01 సంచిక : 8 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Andhrapradesh(Krishna) Sunday, 12-07-2026 Volume :01 Issue: 8 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



# నన్ను చంపితే.. ఇరాన్‌ను ముక్కలు చేయండి

**తనకేమైనా జరిగితే ఇరాన్‌ను నాశనం చేయాలని ఆదేశించానన్న ట్రంప్**

**అధికారులకు ట్రంప్ సంచలన ఆదేశాలు..**

- ట్రంప్ వ్యాఖ్యలతో మరింత పెరిగిన అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు
- ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదు
- నేరపూరిత అమెరికాతో మనం శాంతిని ఎలా కోరుకోగలం?
- అమెరికాకు ఇరాన్ తాజా హెచ్చరిక

**న్యూఢిల్లీ,**


తనపై హత్యా యత్నం తలపెట్టిన ఇరాన్‌ను ముక్కలు, ముక్కలు చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర పన్నుతోందని, ఈ మేరకు ఇరాన్ వర్గాలు ప్లాన్లు రూపొందిస్తున్నాయని అంతర్జాతీయ మీడియా కథనాలను ఆయన తోసిపుచ్చారు. అయితే, అదే సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులకు తాను ఇప్పటికే రహస్యంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. 'న్యూయార్క్ పోస్ట్' ప్రతినిధులతో మాట్లాడిన ట్రంప్..

-మిగతా 2లో

## హిట్.. రన్.. ఎస్కేప్..

# జగన్ విధానం!

**గొడ్డలి, సోషల్ మీడియానే ఆయన అస్త్రాలు**



- ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో చిచ్చు పెడతారు
- ఆ తర్వాత వెళ్లి బెంగళూరులో దాక్కుంటారు
- జగన్ లాంటి నేతలు రాష్ట్రానికి ప్రమాదకరం
- మావిగన్.. జగన్ నేర నైజానికి ఉదాహరణ
- పారిశ్రామికవేత్తలను బెదిరించాలన్నదే ఉద్దేశం
- పెట్టుబడులు రాకుండా చేయాలన్నదే లక్ష్యం
- ఇంతకాలానికి 'బ్రహ్మణి' దోపిడీకి చెక్ పెట్టాం
- త్వరలో ఓబుళాపురం గనుల సంగతి తేలుస్తాం
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం చంద్రబాబు

**అమరావతి,**

"జగన్ నమ్ముకున్నది రెండింటినే. ఒకటి గొడ్డలి. మరొకటి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడమే." అని సీఎం చంద్రబాబు అన్నారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. "హిట్, రన్ అండ్ ఎస్కేప్ విధానంలో గొడ్డలి పార్టీ అధినేత పనిచేస్తున్నాడు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రానికి చుట్టపు చూపుగా వచ్చి ఏదో ఒక విద్వేషాన్ని రెచ్చగొట్టి.. చిచ్చు పెట్టేసి వెళ్లి బెంగళూరులో దాక్కుంటున్నాడు. జగన్‌తో పాటు ఆ పార్టీ నేతలందరిదీ నేర మనస్తత్వమే. అలాంటి వాళ్లు సోషల్ మీడియాను వేదికగా చేసుకుని మరింత విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారు. నిరంతరం రాష్ట్రంపై విషం చిమ్ముతున్నారు.

-మిగతా 2 లో




# పవన్ కల్యాణ్‌కు సర్జరీ

- రెండు భుజాలకీ రోటేటర్ కఫ్ ఇంజ్యూరీస్
- తొలుత కుడి భుజానికి..
- మూడున్నర గంటలపాటు శస్త్ర చికిత్స

**ఏపీ బ్యూరో**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కి శనివారం ఉదయం ముంబయిలో శస్త్ర చికిత్స జరిగింది. ఆయన రెండు భుజాలకు రోటేటర్ కఫ్ ఇంజ్యూరీస్ తీవ్రంగా ఉన్నాయి. ఇటీవల వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడు వీలైనంత త్వరగా శస్త్ర చికిత్స అవసరమని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. అప్పటికే పవన్ కల్యాణ్ నిర్వహించాల్సిన అధికారిక కార్యక్రమాలు నిర్ణయం అయినందున వాటిని ముగించుకొన్న తరువాత శస్త్ర చికిత్స చేయించుకుంటానని పవన్ కల్యాణ్ వైద్యులకు తెలియచేశారు. రెండు భుజాలకు ఒకేసారి శస్త్ర చికిత్స చేయడం వల్ల నొప్పి తీవ్రత భరించలేని స్థాయిలో ఉంటుందని వైద్యు లు తెలిపారు. ఈ క్రమంలో కుడి భుజానికి సంబంధించిన రోటేటర్ కఫ్

-మిగతా 2 లో



# మరాఠీ రాకుంటే.. డ్రైవింగ్ లైసెన్స్ రద్దు!

- ఉత్తర్వులు జారీ చేసిన మహారాష్ట్ర ప్రభుత్వం
- స్థానిక భాషపై పట్టు కోసం కొత్త నిబంధనలు
- ఆటో, టాక్సీ డ్రైవర్లకు భాష నేర్చుకునేందుకు ఐదు వారాల గడువు
- ఇతర రాష్ట్రాల డ్రైవర్ల బాషతో లోకల్స్ ఇబ్బందులు

**ముంబై,**

మహారాష్ట్రలో ఆటో, టాక్సీ డ్రైవర్లకు మరాఠీ తప్పనిసరిగా రావాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంచలనం రేపుతోంది. వచ్చేనెల 16వ తేదీలోగా మరాఠీ నేర్చుకోవాలని లేని పక్షంలో లైసెన్సు రద్దు చేస్తామని ప్రకటించింది. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన డ్రైవర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నపళంగా ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుంటే తమ ఉపాధి పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్రలో మరాఠీ మాత్రమే మాట్లాడాలని కొన్నేళ్లుగా డిమాండ్ వినిపిస్తోంది.

-మిగతా 2 లో




# ఇంగ్లాండ్ గడ్డపై భారత్‌కు భంగపాటు..

- టీ20 సిరీస్‌లో వైట్‌వాష్..!
- ఇంగ్లాండ్‌తో ఐదో టీ20లోనూ భారత్ ఓటమి
- 56 రన్స్ తేడాతో ఇంగ్లాండ్ ఘన విజయం
- 4-0తో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన ఇంగ్లాండ్

**న్యూఢిల్లీ,**

ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో భారత్‌కు భంగపాటు తప్పలేదు. సౌతాంప్టన్ వేదికగా జరిగిన ఆఖరి ఐదో టీ20 మ్యాచ్‌లోనూ భారత జట్టుకు నిరాశే ఎదురైంది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 258 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక టీమిండియా మరో ఓటమిని తన ఖాతాలో వేసుకుంది. 20 ఓవర్లలో 201 పరుగులకు

-మిగతా 2 లో




# ముద్దుల..మురిపెం!

- 30 సెకన్లలో 195 ముద్దులు
- బ్రెజిల్ జంట అరుదైన ఘనత
- గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ప్రేమ జంట
- దీని కోసం రెండేళ్లుగా ప్రాక్టీస్

**న్యూ ఢిల్లీ,**

ప్రేమను వ్యక్తపరచడానికి ఒక్కొక్కరూ ఒక్కో విధానాన్ని ఎంచుకుంటారు. కొందరు మాటలతో మనసు గెలుచుకుంటే మరికొందరు ఆలింగనాలతో ఆప్యాయతను పంచుకుంటారు. అయితే బ్రెజిల్‌కు చెందిన ఒక జంట మాత్రం తమ ప్రేమను ఏకంగా ప్రపంచ రికార్డు స్థాయికి తీసుకెళ్లింది. కేవలం 30 సెకన్ల వ్యవధిలో ఏకంగా 195 ముద్దులు పెట్టుకుని.. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం ఈ రొమాంటిక్ ఫీట్‌కు సంబంధించిన వార్త సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

2 లో




# నిస్తేజంగా రుతుపవనాలు

- ఉపగ్రహ చిత్రాల్లో మేఘరహితంగా 70 శాతం ప్రాంతాలు
- కోస్తాలో వడగాడ్పులు.. బాపట్లలో 40.6 డిగ్రీల ఉష్ణోగ్రత
- నేడు, రేపూ భగభగలే.. 16 తర్వాత అల్పపీడనం

**విశాఖపట్నం,**

నైరుతి రుతుపవనాల సీజన్‌లో కీలకమైన జూలై నెలలో కూడా దేశంలోని చాలా ప్రాంతాల్లో వర్షాభావం కొనసాగుతోంది. రెండు రోజుల క్రితం రుతుపవనాలు దేశవ్యాప్తంగా విస్తరించినా కొద్దిచోట్ల మినహా మెజారిటీ ప్రాంతాల్లో వర్షాలు లేవు. రుతుపవనాలు నిస్తేజంగా ఉండటమే దీనికి కారణమని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. దేశంలోని 70 నుంచి 80 శాతం ప్రాంతాలు మేఘ రహితంగా ఉన్నట్టు శనివారం నాటి ఉపగ్రహ చిత్రాలు తెలియజేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం లేదా అసలు వర్షపాతం లేదని

-మిగతా 2 లో



# 'రాష్ట్ర హోదాపై మా సహనాన్ని పరీక్షించొద్దు'

- కేంద్రానికి ఒమర్ అబ్దుల్లా వార్నింగ్
- జూలై 20న జంతర్‌మంతర్ వద్ద ఎన్‌సీ ఆధ్వర్యంలో నిరసన
- 'మా సహనాన్ని బలహీనతగా భావించొద్దు'
- 'సరైన సమయం' అంటే ఏమిటో చెప్పాలని కేంద్రాన్ని డిమాండ్
- లడఖ్‌తో చర్చలు.. జమ్ముకశ్మీర్‌తో ఎందుకు కాదని ప్రశ్న
- అన్ని రాజకీయ పార్టీల మద్దతు కోరిన ఒమర్ అబ్దుల్లా
- జిల్లా కేంద్రాల్లోనూ ఆందోళనలకు పిలుపు
- కేంద్రం స్పందనపైనే తదుపరి కార్యాచరణ: సీఎం

2 లో

# లోకేష్ టూర్ సక్సెస్

**- భారత్-కొరియా సంబంధాల బలోపేతంలో నూతన అధ్యాయం**

- వారం రోజుల పర్యటనలో 50కి పైగా కంపెనీలతో పెట్టుబడి చర్చలు
- లోకేష్ స్పీడ్ చూసి పల్లి.. పల్లి మంత్ర అంటూ కొరియన్ ప్రతినిధుల ప్రశంసలు



**ఏపీ బ్యూరో**

భారత్ -- కొరియా సంబంధాల బలోపేతమే లక్ష్యంగా రిపబ్లిక్ ఆఫ్ కొరియా (సౌత్ కొరియా) ఆహ్వానం మేరకు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చేపట్టిన సౌత్ కొరియా పర్యటన విజయవంతమైంది. మంత్రి లోకేష్ బృందానికి దక్షిణ కొరియా ప్రభుత్వంతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తల నుంచి సముచిత గౌరవం లభించింది. ఎల్జీ లాంటి గ్లోబల్ కంపెనీలు ప్రత్యేకంగా తమ హెడ్ క్వార్టర్స్ కు ఆహ్వానించి ఉన్నతస్థాయి బృందంతో గౌరవార్వం ఇవ్వడం మంత్రి లోకేష్‌కు దక్కిన అరుదైన గౌరవం. ఈనెల 5నుంచి 11వరకు నిర్వహించిన అధికారిక పర్యటనలో 50కి పైగా కార్పొరేట్ సంస్థల నాయకత్వాన్ని కలిసి ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా లోకేష్ కోరారు.

-మిగతా 2 లో

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471

# నన్ను చంపితే.. ఇరాన్‌ను ముక్కలు చేయండి

(మొదటి తరువాయి)

"అలాంటిదేమీ లేదు, ఇజ్రాయెల్ మాకు ఎలాంటి సమాచారాన్ని అందించలేదు" అని స్పష్టం చేశారు. అయితే, ఇరాన్ హిట్ లిస్ట్ లో తాను చాలా కాలంగా 'నెంబర్ వన్' స్థానంలో ఉన్నాననే విషయాన్ని ఆయన అంగీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఒకవేళ నాకు ఏదైనా జరిగితే.. ఇరాన్ దేశ చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా, ఊహించని స్థాయిలో వారిపై బాంబుల వర్షం కురిపించి సర్వనాశనం చేయాలని నేను స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాను" అని తెలిపారు. అంతకుముందు టర్కీ రాధాని అంకారలో జరిగిన నాటో సదస్సులో ఇరాన్ తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. అయి నప్పటికీ, విజ్ఞప్తిపై చర్చలను కేస్-సాగిస్తామని ట్రంప్ తాజాగా పేర్కొనడం గమనార్హం. తాజా పరిణామాల నేపథ్యంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఒప్పందంలోని నిబంధనలను అమెరికా ఉల్లంఘిస్తే, తాము కూడా తగిన ప్రతిచర్య తీసుకుంటామని తాజాగా హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు. కేవలం



అక్కడి ప్రభుత్వ టీవీ వెల్లడించింది. చర్చల కోసం తాము అమెరికాను ఆహ్వానించామన్న ట్రంప్ వాదనను కూడా ఇరాన్ తోసిపుచ్చింది. కేవలం మధ్యవర్తిగా ఉన్న ఇతర ప్రతినిధుల పర్యటనను మాత్రమే అంగీకరిస్తామని స్పష్టం చేసింది. మరోవైపు ఇరాన్ నేత మహమ్మద్ బమేర్ ఫలిబాఫ్ మరింత తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో యుద్ధం ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ముగియదని ఆయన స్పష్టం చేశారు. "ఒకవేళ అమెరికా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, మమ్మల్ని మేము రక్షించుకోవడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. వారికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడి, ఇరాన్ ప్రజల హక్కులను కాపాడుకుంటాం" అని ఆయన పేర్కొన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాల్ట్ తో చర్చల సమయంలో తమకు వారిపై ఏమాత్రం నమ్మకం లేదని చెప్పినట్లు ఫలిబాఫ్ తెలిపారు. "యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే అమెరికాతో చర్చలు జరపగలరు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థాపకుడు ఆయతుల్లా రుహోల్లా ఖొమేని మనవడు అలీ ఖొమేని కూడా ఇదే తరహాలో స్పందించారు. అమెరికాతో చర్చలు అంటే శాంతి కోసం కాదని, అది కూడా యుద్ధంలో ఒక భాగమేనని అన్నారు. "నేరపూరిత అమెరికాతో మనం శాంతిని ఎలా కోరుకోగలం? అమెరికా శాంతి చర్చలు జరపాలనుకునేవాడు దేశద్రోహి. అమెరికాకు స్నేహ సందేశం పంపేవాడి నేర అవితమైనది" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత నెలలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరినప్పటికీ, మధ్యప్రాచ్యంలో పరస్పర దాడులు జరగడంతో కాల్పుల విరమణ ఒప్పందం బలహీనపడింది. మాజీ సుప్రీం లీడర్ అలీ ఖొమేని అంత్యక్రియల సమయం లోతాలి కంగా నిలిచిపోయిన దాడులు, ఆశ్చర్యకరం ముగిసినా మరుసటి రోజు ఇరాన్ లో పేలుళ్లతో మళ్ళీ మొదలయ్యాయి. అయితే, ఈ పేలుళ్లతో తమకు సంబంధం లేదని అమెరికా ప్రకటించింది.

### ఇంగ్లాండ్ గడ్డపై భారత్‌కు

# భంగపాటు..

(మొదటి తరువాయి)

పరిమితమై.. సిరీస్‌లో వైట్ వాష్‌కు గురైంది. వరుసగా నాలుగు మ్యాచులలో గెలిచిన ఇంగ్లాండ్.. సిరీస్‌ను 4-0తో సొంతం చేసుకుంది. ఈ మ్యాచులో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 257 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. ఓపెనర్ జోస్ బట్లర్ (131) విధ్వంసకర శతకంతో కదం తొక్కగా, హ్యారీ బ్రూక్ (95లి) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు రికార్డు



స్థాయిలో 233 పరుగులు జోడించారు. మరోవైపు భారత బౌలర్లలో ప్రిన్స్ యాదవ్, అక్షర్ పటేల్ దారుణంగా విఫలమయ్యారు. వికెట్లు తీయకపోగా.. భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ప్రిన్స్ యాదవ్ 4 ఓవర్లలో 60, అక్షర్ పటేల్ 4 ఓవర్లలో 63 రన్స్ సమర్పించుకున్నారు. శివమ్ దూబె 2 వికెట్లు తీయగా. అర్షదీప్ సింగ్ ఒక వికెట్ తీశాడు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా విజయం కోసం పోరాడింది. అయితే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి.. విజయానికి చాలా దూరంలో నిలిచిపోయింది. అభిషేక్ శర్మ (3), సంజూ శాంసన్ (27) స్వల్ప స్కోరుకే ఔట్ అయ్యారు. కానీ ఇషాన్ కిషన్ (56), తిలక్ వర్మ (53) రాణించడంతో భారత్ స్కోరు 200 పరుగుల మార్కును దాటింది. కానీ సాధించాల్సిన రన్ రేట్ భారీగా పెరిగిపోవడంతో పరాజయం పాలైంది. చివరకు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులకు పరిమితమైంది. ఇంగ్లాండ్ బౌలర్లలో సామ్ కర్రన్ 3 వికెట్లు తీశాడు. ఆదిల్ రషీద్ 2 వికెట్లు పడగొట్టగా.. జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్, లియామ్ డాసన్ ఒక్కో వికెట్ తీశారు. ఈ విజయంతో ఇంగ్లాండ్ ఐదు మ్యాచుల సిరీస్‌ను 4-0తో క్లీన్ స్వీప్ చేసింది. తొలి మ్యాచులో వర్షం కారణంగా రద్దు అయింది.

# రాష్ట్ర హోదాపై మా సహనాన్ని పరీక్షించొద్దు'..

**శ్రీనగర్:**
జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా విషయంలో తమ సహనాన్ని పరీక్షించవద్దని సీఎం ఒమర్ అబ్దుల్లా కేంద్రాన్ని హెచ్చరించారు. రాష్ట్ర హోదా డిమాండ్‌పై జూలై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. తన అమ్మమ్మ అక్బర్ జహాన్ 26వ వర్ధంతి సందర్భంగా హజ్రత్‌బాల్‌లోని తన తాతా-



అమ్మమ్మల సమాధుల వద్ద శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఒమర్ అబ్దుల్లా ప్రసంగించారు. అమ్మమ్మ నుంచి తాను నేర్చుకున్న అతిపెద్ద పాఠం 'సహనం' అని అబ్దుల్లా తెలిపారు. అయితే జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయంలో తన సహనాన్ని బలహీనతగా భావించవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కాగా, రాష్ట్ర హోదా పునరుద్ధరణకు 'సరైన సమయం' అంటే ఏమిటో కేంద్రం స్పష్టం చేయాలని ఒమర్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. లడఖ్ ప్రతినిధులతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్న కేంద్రం, జమ్ముకశ్మీర్ ప్రజలతో ఎందుకు చర్చలు జరపడం లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర హోదా డిమాండ్ కోసం జూలై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నేషనల్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఆ రోజున జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ కార్యకర్తలను కోరారు. కేంద్రం చర్చలకు సిద్ధంగా ఉన్నదా? లేదా? అనే దానిపైనే ఈ ఉద్యమ తదుపరి కార్యాచరణ ఆధారపడి ఉంటుందని ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు.

# నిస్తేజంగా రుతుపవనాలు


(మొదటి తరువాయి)

గుర్తించాయి. దేశంలో రుతుపవనాల సీజన్‌లో విస్తారంగా వర్షాలు కురవడానికి హిందూమహాసముద్రం నుంచి వీచే తేమ గాలులు, రుతుపవనద్రోణి ప్రధాన కారకాలుగా చెబుతారు. అయితే పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన శక్తిమంతమైన ఉష్ణమండల తుఫాన్ ప్రభావంతో భారత ఉపఖండం వైపు తేమ రావడం లేదని, ఫలితంగా దేశంలోని చాలా ప్రాంతాల్లో వర్షపాతం గణనీయంగా తగ్గిందని నిపుణులు చెబుతున్నారు. ఈనెల 15కల్లా ఉత్తర వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడుతుందని, 16 తర్వాత ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు ఆనుకుని బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని ఐఎండీ తాజా బులెటిన్‌లో పేర్కొంది. జూన్‌లో దేశంలో 40 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ చివరి నుంచి జూలై ఐదారు తేదీల వరకు కురిసిన వర్షాలతో దేశంలో లోటు శాతం 14కు తగ్గినా అనేక ప్రాంతాల్లో వర్షాల జాడలేదు. రుతుపవనాలు తిరిగి పుంజుకునేంత వరకు దేశంలో పగటి ఉష్ణోగ్రత పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. శనివారం కోస్తాంధ్రలోని అనేక ప్రాంతాల్లో వడగాడ్పులు వీచాయి. బాపట్లలో 40.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు రోజుల్లో గాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

# ముద్దుల..మురిపెం!

**- 30 సెకన్లలో 195 ముద్దులు**
**-బ్రెజిల్ జంట అరుదైన ఘనత**
**- గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ప్రేమ జంట**
**- దీని కోసం రెండేళ్లుగా ప్రాక్టీస్**

ప్రపంచ వ్యాప్తంగా హల్‌చల్
బ్రెజిల్‌కు చెందిన రెనాటో బేమా తన ప్రేయసి రోబెర్టా రిబిరో బుగ్గ్పై అత్యంత వేగంగా ముద్దులు కురిపించి ఈ అరుదైన ఘనతను సాధించారు. ఈ రికార్డు ప్రయత్నం బ్రెజిల్‌లోని సావో జోస్ డాస్ కాంపోస్ నగరంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక ప్రతినిధుల సమక్షంలో జరిగింది. అనంతరం అంతర్జాతీయ కిస్



డే సందర్భంగా ఈ విజయానికి సంబంధించిన వివరాలను అధికారికంగా విడుదల చేయడంతో ఈ వార్త ప్రపంచ వ్యాప్తంగా హల్‌చల్ చేస్తోంది. గిన్నిస్ నిబంధనల ప్రకారం ఈ రికార్డు సాధించడం అంత సులువు కాదు. వారు విధించిన కఠినమైన నిబంధనలున్నాయి. ప్రతి ముద్దు పూర్తిగా వేరుగా ఉండాలి. ఒకసారి ముద్దు పెట్టిన తర్వాత పెదవులు బుగ్గ నుంచి పూర్తిగా విడిపోవాలి. విరామం లేకుండా తదుపరి ముద్దు అంతే వేగంతో కొనసాగించాలి.

సెకనుకు ఆరు ముద్దుల కంటే ఎక్కువగానే..
ఈ కఠినమైన నియమాలను ఎక్కడ ఉల్లంఘించకుండా రెనాటో అత్యంత వేగంగా 30 సెకన్లలో 195 ముద్దులు పూర్తి చేశారు. అంటే లెక్క గడితే ఆయన సెకనుకు ఆరు కంటే ఎక్కువ ముద్దులు పెట్టారన్నమాట.. ఈ అద్భుతమైన వేగం, సమన్వయం చూసి అక్కడ ఉన్న గిన్నిస్ అధికారులు సైతం నోరెళ్లబెట్టారు. పాత రికార్డులు బద్దలు.. తదుపరి లక్ష్యం అదే ఇంతకుముందు ఈ రికార్డు ఒక బ్రిటిష్ జంట పేరిట ఉండేది. వారు 30 సెకన్లలో 146 ముద్దులు పెట్టి రికార్డు సృష్టించగా ఈ బ్రెజిల్ జంట ఏకంగా 49 ముద్దుల భారీ తేడాతో ఆ రికార్డును తిరగరాసింది. 'చూడటానికి ఇది కేవలం ఒక సరదా రికార్డుల అనిపించినా దీని వెనుక అత్యంత కఠినమైన క్రమశిక్షణ, సమన్వయం, నెలల తరబడి చేసిన ప్రాక్టీస్ ఉన్నాయి.' అని గిన్నిస్ ప్రతినిధులు రికార్డును ఆ ముద్దుల మాపయ్య చేతిలో పెట్టారు.

# లోకేష్ టూర్ సక్సెస్

(మొదటి తరువాయి)

తొలిరోజు సియోల్ లో తెలుగు ప్రజలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంతో ప్రారంభమైన పర్యటన, శుక్రవారం సీఐఐ ఆధ్వర్యాన పెట్టుబడిదారులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ తో ముగిసింది.

లోకేష్ ఇచ్చిన ప్రజెంటేషన్‌తో ఫిదా..
మంత్రి లోకేష్ తో నిర్వహించిన భేటీల అనంతరం ఎల్జీ, హ్యుందయ్, శాంసంగ్, బీఎస్ కే ఫైనాన్షియల్ వంటి దిగ్గజ కొరియన్ కార్పొరేట్ సంస్థలు, తమ ఉన్నత నాయకత్వంతో సంప్రదించి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చాయి. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న స్పష్టమైన పారిశ్రామిక విధానాలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, అందజేస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి లోకేష్ ఇచ్చిన ప్రజెంటేషన్ తో వివిధ సంస్థల ప్రతినిధి బృందాలు ఫిదా అయ్యాయి.

'అపెక్స్-కొరియా'తో కొరియన్ సంస్థలకు భరోసా..
పర్యటన తొలిరోజున సియోల్ లో భారత రాయబారి గౌరంగలాల్ దాస్ తో నిర్వహించిన మర్యాదపూర్వక భేటీలో కొరియా ప్రాధాన్యతారంగ పరిశ్రమలను ఏపీకి తీసుకవచ్చేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తూ ఆంధ్రప్రదేశ్ విజన్ ను ఆయన వివరించారు. దక్షిణ కొరియా ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్ లో ఏపీఈడీబీ ఆధ్వర్యాన 'అపెక్స్ - కొరియా' పేరిట పెట్టుబడిదారుల సహాయక, అనుసంధాన విభాగాన్ని ప్రారంభించడం ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలకు నిదర్శనం. శ్రీసిటీ పరిసరాల్లో ఇప్పటికే కొలువై ఉన్న 40కిపైగా కొరియన్ కంపెనీలతోపాటు కొత్తగా వచ్చేందుకు ఆసక్తి చూపే సంస్థలకు భరోసా ఇచ్చినట్టయింది.

3ఎస్ విధానంపై సానుకూల స్పందన..
ఆంధ్రప్రదేశ్ లో కేవలం రెండేళ్ల వ్యవధిలో 'కియా' సాధించిన విజయాన్ని ఉదాహరణిస్తూ, ఏపీ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు, 3ఎస్ మోడల్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్), వేగవంతమైన అనుమతులపై మంత్రి లోకేష్ వివరించిన తీరుపై కొరియా మీడియా, దిగ్గజ కంపెనీలు సానుకూలంగా స్పందించాయి. ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బృందం పర్యటనపై కోట దక్షిణ సియా విభాగాధిపతి క్యుంగ్వాన్ కిమ్ ప్రశంసల వర్షం కురిపిస్తూ, నారా లోకేష్ బృందానికి హాట్స్వాప్ అంటూ ట్విట్టర్ లో అభినందనలు తెలపడం పర్యటన విజయవంతానికి నిదర్శనం. కొరియన్ ప్రతినిధులు మంత్రి లోకేష్ వేగం చూసి పల్లి..పల్లి మంత్రి అని కొత్త పేరు పెట్టారు. పల్లి..పల్లి అనే కొరియన్ పదానికి అర్థం త్వరగా.. త్వరగా అని. వారంరోజుల అధికారిక పర్యటనను పెట్టుబడుల యాత్రగా మార్చిన మంత్రి లోకేష్ లక్ష్యం రాష్ట్రాభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధి, కమిట్‌మెంట్ ను తెలియజేస్తోంది.

### మరాఠీ రాకుంటే..

# డ్రైవింగ్ లైసెన్స్ రద్దు!

(మొదటి తరువాయి)

ప్రధానంగా హిందీని వ్యతిరేకిస్తున్న మరాఠీ భాషాభిమానులు మాతృభాషపై ఉద్యమాలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం స్థానిక భావోద్వేగాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సంచలన నిర్ణయం తీసుకుందని చెబుతున్నారు. మహారాష్ట్రలోని ఆటో రిక్షా, టాక్సీ డ్రైవర్లందరికీ



మరాఠీ భాషా ప్రావీణ్యం తప్పనిసరి చేస్తూ రవాణా శాఖ జారీ చేసిన ఉత్తర్వులు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. భాషా సంస్కృతిని కాపాడుకోవాలనే సాకుతో తీసుకున్న ఈ నిర్ణయం, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి మహారాష్ట్రకు వలస వచ్చిన లక్షలాది మంది డ్రైవర్ల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందన్న ఆగ్రహానికి కారణమవుతోంది. ఆగస్టు 16వ తేదీ లోపు మరాఠీ భాషా పరీక్షలో ఉత్తీర్ణత సాధించని డ్రైవర్ల లైసెన్సులు, బ్యాడ్జీలను రద్దు చేస్తామని రవాణా మంత్రి ప్రతాప్ స్పష్టం చేశారు. గతంలో ఈ నిబంధన ఉన్నప్పటికీ, ఉల్లంఘించిన వారికి కేవలం 500 రూపాయల జరిమానాతో సరిపెట్టేవారు. కానీ ఇప్పుడు, కేవలం జరిమానాతో కాకుండా నేరుగా లైసెన్సు రద్దు చేయడం ద్వారా వలస డ్రైవర్లపై ప్రభుత్వం కత్తి వేలాడదీసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో, నాన్ మరాఠీ డ్రైవర్లకు భాష నేర్పించేందుకు ప్రభుత్వం 450 మంది ఉపాధ్యాయులను నియమించినట్లు చెబుతున్నారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశంపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం వాదిస్తున్న దాని ప్రకారం, ప్రయాణికులతో, ముఖ్యంగా స్థానిక ప్రజలతో మెరుగ్గా కమ్యూనికేట్ చేయడానికి డ్రైవర్లకు స్థానిక భాష వచ్చి ఉండటం అవసరమని అంటున్నారు. ఇది ప్రయాణికుల భద్రత, సౌకర్యానికి మేలు చేస్తుందని, సంస్కృతిని పరిరక్షించే బాధ్యత తమదని అధికార పక్షం వాదిస్తోంది. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇది కేవలం వలస కార్మికులను వేధించడానికి, రాజకీయంగా లబ్ధి పొందడానికి వేస్తున్న ఎత్తుగడ అని వారు ఆరోపిస్తున్నారు.

### హిట్.. రన్.. ఎస్కేప్..

# జగన్ విధానం!

(మొదటి తరువాయి)

ప్రభుత్వాన్ని, కూటమి నేతల్ని లక్ష్యంగా చేసుకుని విషప్రచారం చేయడమే లక్ష్యంగా గొడ్డలి పార్టీ నేతలు పనిచేస్తున్నారు." అని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో టెక్నాలజీలో చాలా మార్పులు వస్తాయని, అవి మరింత ప్రమాదకరంగా ఉండొచ్చన్నారు. అలాంటి ప్రమాదాలు ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రంలో అరాచకం సృష్టించడం కోసం టీడీపీ నేతలను రెచ్చగొట్టి ట్రాప్‌లోకి లాగాలని గొడ్డలి పార్టీ నేతలు చూస్తున్నారని, వైసీపీ వాళ్ల ట్రాప్‌లో పడొద్దని పార్టీ నాయకులందరికీ గట్టిగా హెచ్చరించానని సీఎం తెలిపారు.

**ఆ హంతకుడిలానే.. జగన్ కూడా!**
తెలంగాణలో ఓ సైకో తనపై పోక్సో కేసు పెట్టారని ఓ కుటుంబాన్ని, జైలుకు వెళ్లిన తనకు సహకరించలేదని సొంత కుటుంబాన్ని మొత్తంగా ఆరుగురిని హత్యచేశాడు. జగన్ మనస్తత్వం కూడా అలాంటిదే. తనకు సహకరించలేదని సొంత తల్లి, చెల్లిని తరిమేశాడు. సొంత బాబాయిపై గొడ్డలి ప్రయోగించాడు. ప్రజలు తనకు ఓటేయలేదని రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలనే ఆలోచనతో జగన్ వ్యవహరిస్తున్నాడు. జగన్‌లాంటి నేరప్రవృత్తి ఉన్న నేతలు రాష్ట్రానికి ప్రమాదకరం. నేరప్రవృత్తిని నిలువరించాలంటే టెక్నాలజీతో పాటు ఆధ్యాత్మికత కూడా ఎంతో ముఖ్యం. జగన్ కుటుంబ చరిత్ర మొత్తం నేరపూరితమే. ఆ కుటుంబం వల్ల దేశంలో ఎక్కడా లేని విధంగా ఎందరో ఐఏఎ?సలు, ఐపీఎ?సలు, పలువురు పారిశ్రామికవేత్తలు కూడా జైలుకు వెళ్లారు.

**ఆ భూదోపిడీ జరగకుంటే..**
వైఎస్ హయాంలో బ్రహ్మణి స్టీల్స్ పేరుతో జరిగిన వ్యవహారం అంతా మోసమే. ఓబుళాపురం గనులను తవ్వి సొమ్ము చేసుకునేందుకు బ్రహ్మణీ స్టీల్స్ అనే డ్రామా ఆడా రు. 14వేల ఎకరాలను అప్పనంగా కట్టబెట్టేశారు. విలువైన ఖనిజాన్ని తవ్వి సొమ్ము చేసుకున్నారు. ఆ భూములను, ఓబుళాపురం గనులను సద్వినియోగం చేసుకుని ఉంటే ఎన్నో పరిశ్రమలు వచ్చేవి. యువతకు ఉపాధి అవకాశాలు లభించేవి. విశాఖ బాక్సైట్ విషయంలోనూ అదేవిధంగా వ్యవహరించారు. ఇంతకాలానికి బ్రహ్మణి స్టీల్స్‌కు చెక్ పెట్టి భూములను స్వాధీనం చేసుకోగలిగాం. ఓబుళాపురం మైనింగ్ వ్యవహారాన్ని త్వరలో కొలిక్కి తెస్తాం. రాష్ట్రానికి ఉన్న ప్రధాన వనరు విలువైన భూములే. వాటిని వైఎస్ కుటుంబం తమ సొంత ఆస్తిలా ధారాదత్తం చేసి లక్షల కోట్ల దోపిడీకి పాల్పడింది.

**జగన్‌ను ఆదర్శంగా తీసుకోవద్దు!**
టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబును.. టెక్కలి మాజీ ఎమ్మెల్యే వరద సరోజ భర్త, ఆమె ఇద్దరు కుమార్తెలు కలిశారు. తమ ఆస్తిని సొంత కొడుకు లాగేసుకుని ఇంటి నుంచి గెంటేశాడని సరోజ భర్త ఆవేదన వ్యక్తంచేశారు. పరిశీలించి న్యాయం చేస్తానని సీఎం హామీ ఇచ్చారు. ఈ ఉదంతాన్ని చంద్రబాబు మీడియాతో ప్రస్తావించారు. "సరోజ ఫ్యామిలీ ఒకప్పుడు బాగా బతికిన కుటుంబం. శ్రీకాకుళంలో మొదట హోటల్ పెట్టింది వారే. జగన్ లాంటి నేతలను సమాజంలో కొందరు ఆదర్శంగా తీసుకుంటున్నారు. ఇది చాలా ప్రమాదకర ధోరణి. అదే జరిగితే కుటుంబ విలువల అర్థమే మారిపోతుంది.

# పవన్ కల్యాణ్‌కు సర్జరీ

(మొదటి తరువాయి)

ఇంజ్యూరీ కి శనివారం ఆపరేషన్ చేశారు. ముందస్తు గా చేయాల్సిన వైద్య పరీక్షలను శుక్ర వారం నిర్వహించారు. శనివారం రోజున నిర్వహించిన ఆపరేషన్ కు మూడున్నర గంటల సమయం పట్టినట్లు వైద్యులు తెలి పారు. మరో భుజానికి రెండు నెలల వ్యవధిలో శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది.

**పదేళ్ల నుంచి నొప్పి భరిస్తూ...**
పవన్ కల్యాణ్ కి 2016లో భుజానికి గాయాలు అయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు తగిన విశ్రాంతి అవసరం అని సూచించినా సమావేశాలలో పాల్గొన్నారు. 2018లో చేపట్టిన పోరాట యాత్ర సందర్భంలో జనసేన పార్టీ శ్రేణులు తమ అభిమాన నాయకుడికి దగ్గరగా వెళ్ళి చేతులు కలపాలనే ఉద్దేశంతో చేతులు పట్టి లాగేవారు. ఆ సందర్భంలో నొప్పి కలిగినా భరించేవారు. 2019 ఎన్నికల అనంతరం రాయలసీమ జిల్లాల్లో ముఖ్యంగా మదనపల్లెలో టమోటా రైతుల సమస్యలు తెలుసుకోవడానికి వెళ్ళిన సందర్భంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పవన్ కల్యాణ్ కి చేరువగా వెళ్ళి కరచాలనం చేయడం, ఆప్యాయంగా హత్తుకొనే సందర్భాల్లో గాయాలు తిరగబెట్టాయి. ఏప్రిల్ మాసంలో పవన్ కల్యాణ్ ముక్కుకి శస్త్ర చికిత్స చేసే సందర్భంలో పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంలో భుజాలకు రోటేటర్ కఫ్ ఇంజ్యూరీస్, మజిల్ టియర్స్ తీవ్ర స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. ఇంత తీవ్ర గాయాలు ఉన్నప్పటికీ ఏ విధంగా భరిస్తున్నారని వైద్యులు ఆశ్చర్యపడ్డారు. వీటికి వీలైనంత త్వరగా ఆపరేషన్ చేయాలని అప్పుడే వైద్యులు సూచించారు. ఈ క్రమంలోనే కొద్ది వారాల కిందట ముంబయిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శనివారం కుడి భుజానికి ఆపరేషన్ నిర్వహించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతోంది.

**శస్త్ర చికిత్స విజయవంతం.....**
పవన్ కల్యాణ్ కి ముంబయిలో నిర్వహించిన శస్త్ర చికిత్స విజయవంతమైంది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డా.దిన్షా పార్డీవాలా నేతృత్వంలోని వైద్యుల బృందం పవన్ కల్యాణ్ కుడి భుజానికి సర్జరీ నిర్వహించారు. రోటేటర్ కఫ్ ఇంజ్యూరీతో పాటు, భుజానికి అవల్షన్ ఫ్రాక్చర్ ఉండటంతో భారీ సర్జరీ చేయాల్సి వచ్చింది. ఈ సర్జరీకి మూడున్నర గంటల సమయం పట్టింది. ఆపరేషన్ థియేటర్ నుంచి రికవరీ రూమ్ కి తీసుకువచ్చారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు.

# జూలై 14లోగా ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించాలి

-


**ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**




**నంద్యాల ప్రతినిధి, జూలై 11 (నేటి దర్శిని)**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఎన్యూమరేషన్ ఫారమ్‌ను తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. జూలై 14తో ఈ ప్రత్యేక కార్యక్రమం ముగియనున్నందున మిగిలిన రోజులను సద్వినియోగం చేసుకుని ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆమె కోరారు. శనివారం జిల్లా ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 14,05,443 మంది ఓటర్లు నమోదై ఉన్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, విశ్వసనీయతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి రెండు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను అందజేస్తున్నారని తెలిపారు. ఒక ఫారమ్‌ను ఓటరు స్వీకరించినట్లు అంగీకారంగా ఉంచుకుని, రెండో ఫారమ్‌ను అవసరమైన వివరాలతో పూరించి తిరిగి బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని సూచించారు. అందిన ఫారమ్‌లన్నింటినీ డిజిటలైజ్ చేసి తుది ఓటరు జాబితా తయారీలో వినియోగిస్తామని చెప్పారు. ఫారమ్‌ను సమర్పించని పక్షంలో సంబంధిత ఓటరు పేరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు కాకపోయే అవకాశం ఉందని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 10,90,722 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి అందగా వాటిని విజయవంతంగా డిజిటలైజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్ల సహకారంతో మరణించిన వారు, డూప్లికేట్ నమోదులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లకు సంబంధించిన 55,449 ఫారమ్‌లను కూడా డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంకా 2,59,272 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి అందాల్సి ఉందన్నారు. మిగిలిన ఫారమ్‌ల సేకరణను వేగవంతం చేసేందుకు శనివారం, ఆదివారం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జూలై 14 గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఓటరు బాధ్యతగా స్పందించి తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌ను వెంటనే సంబంధిత బూత్ లెవల్ అధికారికి అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు, అధికారులు సమిష్టిగా సహకరించాలని కోరారు. పారదర్శకమైన, సమగ్రతతో కూడిన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి ఓటరి భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదని కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు.

# శ్రీశైలానికి రైలు మార్గం ఏర్పాటు చేయాలి

**జాతీయ ప్రాధాన్యత ప్రాజెక్టుగా గుర్తించి త్వరితగతిన ఆమోదించాలని రైల్వే లైన్ సాధన సమితి డిమాండ్**




**నంద్యాల ప్రతినిది జూలై 11 (నేటి దర్శిని)**
దేశంలోని అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన, ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన నంద్యాల జిల్లా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం శ్రీశైలానికి నూతన రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయాలని శ్రీశైలం రైల్వే లైన్ సాధన సమితి కన్వీనర్, ప్రముఖ న్యాయవాది దేవలపాటి కాశీరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు శ్రీశైలానికి దర్శనార్థం వస్తున్నప్పటికీ, ఇప్పటికీ ప్రత్యక్ష రైల్వే సౌకర్యం లేకపోవడం భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గతంలో రాష్ట్రపతులు, ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు శ్రీశైలాన్ని సందర్శించి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారని గుర్తు చేశారు. ఈ ఏడాది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా శ్రీశైలాన్ని సందర్శించి అక్కడి ఆధ్యాత్మిక వైభవాన్ని అనుభవించారని పేర్కొన్నారు. దక్షిణ భారత ప్రజల ఆకాంక్ష మేరకు శ్రీశైలం రైల్వే ప్రాజెక్టును జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా ప్రకటించాలని ఆయన కోరారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని శ్రీశైలం రైల్వే లైన్ సాధన సమితి తరపున అభినందించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. శ్రీశైలానికి రైల్వే మార్గం ఏర్పాటుతో భక్తులకు మాత్రమే కాకుండా నల్లమల ప్రాంత అభివృద్ధి, గిరిజన సంక్షేమం, పర్యాటక రంగం, స్థానిక ఉపాధి, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి విశేష ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. హైదరాబాద్--శ్రీశైలం--మార్కాపురం రైల్వే మార్గం అందుబాటులోకి వస్తే ప్రయాణం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందిన శ్రీశైలం, నల్లమల అటవీ ప్రాంతం, శ్రీశైలం జలాశయం వంటి ప్రాంతాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దీనిని జాతీయ ప్రాధాన్యత ప్రాజెక్టుగా గుర్తించి త్వరితగతిన ఆమోదించాలని కోరారు. ఈ ఉద్యమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన ఎంపీలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు, భక్తులు, ప్రజలు రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని దేవలపాటి కాశీరావు విజ్ఞప్తి చేశారు.

# టీడీపీ ఎన్నారై జాతీయ కమిటీలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు కీలక పదవులు

**అధ్యక్షుడిగా డాక్టర్ పిల్లి గురు రాజా..**
**ఆర్గనైజింగ్ సెక్రటరీగా షా ఫహద్ సయ్యద్**



**కర్నూల్ జూలై 11 (నేటి దర్శిని)**
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన టీడీపీ ఎన్నారై (ఎన్ఆర్ఐ) జాతీయ కమిటీలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులకు కీలక బాధ్యతలు దక్కాయి. దీంతో జిల్లాలో పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ ఎన్నారై జాతీయ కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ పిల్లి గురు రాజా నియమితులయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా షా ఫహద్ సయ్యద్‌కు బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులకు ఒకేసారి జాతీయ స్థాయి పదవులు లభించడం జిల్లాకు గర్వకారణమని పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పిల్లి గురు రాజా, షా ఫహద్ సయ్యద్‌లు తమపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాలను ప్రవాస భారతీయుల్లో మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ఎన్నారై విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తామని వారు తెలిపారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజలను పార్టీతో మరింత అనుసంధానం చేయడం, పార్టీ కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచే దిశగా కృషి చేస్తామని స్పష్టం చేశారుటీడీపీ ఎన్నారై విభాగం ద్వారా రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రవాసాంధ్రుల సహకారాన్ని మరింత పెంచేందుకు ఈ కమిటీ కీలకంగా పనిచేస్తుందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన నాయకులకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యం లభించడం జిల్లాలో పార్టీకి మరింత బలం చేకూర్చే పరిణామమని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# చంద్రబాబు సంస్కారం లేని రాజకీయ నాయకుడు

**- పేర్నినాని ఘాటు వ్యాఖ్య**



**అమరావతి జూలై 11 (నేటి దర్శిని)**
రాజకీయ సంస్కారం లేని నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడ ని వైసీపీ మాజీ మంత్రి పేర్నినాని వ్యాఖ్యనించారు. రాజకీయ అనుభవం, పలుమార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి వైఎస్ జగన్ ై తప్పుడు కూతలు కూస్తు సమాజానికి ఉపయోగం లేని మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఆరుగురిని హత్య చేసిన ఓ సైకోకు వైఎస్ జగన్ పోలికలున్నాయని విమర్శించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. చంద్రబాబు వయస్సుకు తగ్గట్టు మాట్లాడడం లేదని విమర్శించారు. సోషల్ మీడియాలో 80శాతం టీడీపీకి చెందినవేనని స్పష్టం చేశారు. మీడియా, సోషల్ మీడియా దిగజారిపోవడానికి కారకుడు చంద్రబాబే కారణమని విమర్శించారు. వైఎస్ జగన్ సతీమణిపై నీచ, విష ప్రచారం చేశారని వెల్లడించారు. వైసీపీపై తప్పుడు ప్రచారాలు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని అన్నారు. సోషల్ మీడియా కోసం ప్రభుత్వం రూ.206 కోట్లు జనం డబ్బును ఖర్చుచేసిందని ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తిచూపుతున్న మీడియా, సోషల్ మీడియాలపై చర్యలు తీసుకుంటూ వికృత చేష్టలకు పాల్పడుతున్నారని పేర్నినాని దుయ్యబట్టారు.

# ఇద్దరు పిల్లల మధ్య సరైన ఎడం ఉండాలి:

**-వైద్యాధికారి డాక్టర్ రమ్య**
**-ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శావల్యాపురంలో అవగాహన ర్యాలీ**




**శావల్యాపురం, జూలై 11 (నేటి దర్శిని)**
ఇద్దరు పిల్లల మధ్య కనీసం 18 నుంచి 24 నెలల వ్యవధి ఉండాలని, అప్పుడే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి డాక్టర్ రావిపూడి రమ్య అన్నారు. తక్కువ వ్యవధిలో గర్భం దాల్చితే తల్లిలో రక్తహీనత వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ "పిల్లల మధ్య ఎడం పాటిద్దాం -- ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం" అనే నినాదంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పిల్లల జననాల మధ్య తగిన వ్యవధి పాటించడం వల్ల తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. బిడ్డకు తగినంత మాతృపాలు అందడంతో పాటు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఎదుగుతారని, వ్యాధి నిరోధక శక్తి కూడా పెరుగుతుందని వివరించారు. పిల్లల మధ్య సరైన వ్యవధి కోసం నోటి గర్భనిరోధక మాత్రలు, నిరోధ్‌లు, అంతరా ఇంజెక్షన్లు, లూప్ (ఐయూసీడీ) వంటి గర్భనిరోధక సాధనాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.

# ఓటర్ల సందేహాలకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సమాధానాలు

**-ప్రత్యేక ఫోన్-ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన..**
**-అర్హులందరికీ ఓటు హక్కే లక్ష్యమని స్పష్టం**



**శ్రీ సత్యసాయి,జూలై 11 (నేటి దర్శిని)**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియపై ప్రజల్లో ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసేందుకు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఫోన్-ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఓటర్ల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు నిర్వహించిన ఈ ప్రత్యక్ష కార్యక్రమంలో ఓటర్లు ఫోన్ ద్వారా అడిగిన పలు సాంకేతిక, సాధారణ ప్రశ్నలకు కలెక్టర్ వివరంగా సమాధానాలు ఇచ్చారు. ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా నింపాలి, అందులో ఏ వివరాలు నమోదు చేయాలి, 2002 ఓటర్ల జాబితాలోని వివరాలను ఎలా పొందాలి, పేరు లేకపోతే ఏ విధంగా నమోదు చేసుకోవాలి వంటి అంశాలపై కలెక్టర్ స్పష్టమైన వివరణ ఇచ్చారు. అలాగే బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు)ను ఎలా సంప్రదించాలి, ఇతర ప్రాంతాల నుంచి శాశ్వతంగా వచ్చిన వారు, వేరే రాష్ట్రం నుంచి వివాహం చేసుకుని వచ్చిన మహిళలు ఓటు హక్కు కోసం ఏ ప్రక్రియను అనుసరించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అవసరమైన నివాస ధ్రువీకరణ పత్రాలతో ఫారం-8 ద్వారా ఓటు బదిలీ లేదా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ఓటర్లు తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు.

# ఏ ఐ టీ యూ సీ లో చేరిక





**చౌటుప్పల్,జూలై 11 (నేటి దర్శిని)**
ఏఐటియుసి ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాలుగవ మండల మహాసభ మండల కేంద్రంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా బోలగాని సత్యనారాయణ ఎండి ఇమ్రాన్ గార్ల ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ కార్మికులకు అండగా ఉంటూ హక్కుల కోసం పోరాడుతూ ముందుకు సాగుతున్న కార్యక్రమాలను ఆకర్షితులై ఐ ఎన్ టి యు సి మండల అధ్యక్షుడు పులమోని శంకర్ దుర్గం గాలయ్య తదితరులు రాజీనామా చేసి ఏఐటీయూసీ లో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గోని గాలయ్య సిపిఐ జిల్లా నాయకులు కలకొండ సంజీవ సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ ఏఐటీయూసీ అధ్యక్షులు చిలువేరు అంజయ్య మండల కార్యదర్శి దుబ్బాక సంజీవ సర్పంచ్ ముత్యాల అంజయ్య ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి. జనగాం శంకరయ్య ఉప్పరగొని యాదగిరి తదితరులు పాల్గొన్నారు



## హాట్ షోలో రెచ్చిపోయిన నిధి అగర్వాల్..

# జూలై 24న 'రామాయణ' ట్రైలర్!

## అద్భుత దృశ్యకావ్యానికి ముహూర్తం ఫిక్స్..



ఇండియన్ సినిమా హిస్టరీలోనే మోస్ట్ అవేటెడ్ మూవీగా నిలుస్తున్న 'రామాయణ' సినిమా నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. నితేష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), రాకింగ్ స్టార్ యష్ (రావణాసురుడు) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ పౌరాణిక చిత్రం యొక్క అఫీషియల్ ట్రైలర్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. జూలై 24న ఈ మూవీ ట్రైలర్‌ను ప్రపంచవ్యాప్తంగా చాలా గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. వేలాది సంవత్సరాలుగా భారతదేశ సంస్కృతికి, సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచిన రామాయణాన్ని ఈ తరం ఆడియన్స్‌కు నచ్చేలా సరికొత్తగా చూపించబోతున్నారు. హాలీవుడ్ రేంజ్ విజువల్ ఎఫెక్ట్స్, భారీ నిర్మాణ విలువలతో నమిత్ మల్హోత్రా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. కంప్లీట్ ఇండియన్ సినిమా హిస్టరీలోనే ముందెన్నడూ చూడని విధంగా, ఊహించని రేంజ్ బడ్జెట్‌తో ఈ సినిమా రెడీ అవుతోంది. దేశం గర్వించే ఈ గొప్ప ఇతిహాసాన్ని వరల్డ్ వైడ్ ఆడియన్స్ ముందుకు గ్రాండ్‌గా తీసుకురాబోతున్నారు. కాగా, ఈ క్రేజీ మూవీ పార్ట్-1 ను ఈ ఏడాది దీపావళి కానుకగా థియేటర్లలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.


# రామ్‌తో ప్రేమ వార్తలకు భాగ్యశ్రీ బోర్సే

## -వైరల్ అవుతున్న కామెంట్స్!

మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన బాలీవుడ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. తొలి సినిమా ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, తన అందం, నటనతో దర్శక నిర్మాతల దృష్టిని ఆకర్షించిన ఈ భామ తాజాగా 'లెనిన్' సినిమాతో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇప్పుడు ఆమె సినిమా కంటే ఎక్కువగా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కొంతకాలంగా హీరో రామ్ పోతినేనితో భాగ్యశ్రీ ప్రేమలో ఉన్నారనే ప్రచారం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇద్దరూ కలిసి నటిస్తున్న 'ఆంధ్రా కింగ్ తాలూకా' సినిమా ప్రారంభమైనప్పటి నుంచే ఈ రూమర్స్ ఊపందుకున్నాయి. అయితే ఈ వార్తలపై రామ్ గతంలో స్పందించి ఖండించినప్పటికీ, భాగ్యశ్రీ మాత్రం ఎప్పుడూ నేరుగా స్పందించలేదు. దీంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది. ఇటీవల 'లెనిన్' సినిమా ప్రమోషన్లలో భాగంగా భాగ్యశ్రీ చేసిన కొన్ని వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. "హైదరాబాద్ నా రెండో ఇల్లు" అని ఆమె చెప్పడంతో, సోషల్ మీడియాలో మళ్లీ రామ్‌తో రిలేషన్‌పై ఊహాగానాలు మొదలయ్యాయి. అభిమానులు కూడా వీరిద్దరూ నిజంగానే డేటింగ్‌లో ఉన్నారేమో అంటూ కామెంట్లు చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న భాగ్యశ్రీకి ఆసక్తికరమైన ప్రశ్న ఎదురైంది. మీరు కలిసి పనిచేసిన హీరోల్లో ఎవరితో ఫ్రెండ్‌షిప్, ఎవరితో డేటింగ్, ఎవరిని పెళ్లి చేసుకుంటారు? అని అడగగా, అఖిల్ అక్కినేని తనకు మంచి స్నేహితుడని చెప్పిన ఆమె, డేటింగ్ మరియు పెళ్లి విషయానికి వచ్చేసరికి ఒకే హీరో పేరును సూచిస్తూ నవ్వింది. నేను కలిసి నటించిన హీరోల్లో పెళ్లి కాని వ్యక్తి ఒక్కరే ఉన్నారు అని చెప్పడంతో, ఆమె ఉద్దేశం రామ్ పోతినేనినేనని నెటిజన్లు భావిస్తున్నారు. ఈ వ్యాఖ్యలకి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిమానులు సరదాగా భాగ్యశ్రీ పోతినేని అంటూ పోస్టులు చేస్తుండగా, మరికొందరు ఇది కేవలం ఫన్ సెగ్మెంట్ మాత్రమేనని అంటున్నారు. అయితే ఈ కామెంట్స్‌ని తమ ప్రేమ వ్యవహారానికి సంబంధించి అఫీషియల్ భావించే పరిస్థితి లేదు. రామ్ లేదా భాగ్యశ్రీ నుంచి ఈ అంశంపై ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాలేదు. ప్రస్తుతం భాగ్యశ్రీ కెరీర్ పరంగా కూడా బిజీగా ఉంది. వరుస సినిమాలతో అవకాశాలు అందుకుంటూ ముందుకు సాగుతున్న ఈ నటి, 'లెనిన్' విజయంతో మరిన్ని ప్రాజెక్టులు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# ప్రమోషనల్ పోస్ట్‌కు పదిలక్షలు?



సినిమాల పరంగా విజయాలు తక్కువే అయినా అచ్చ తెలుగందం శ్రీలీల క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. అందుకు యూత్‌లో ఈ భామకున్న ఫాలోయింగ్‌ను కారణంగా చెప్పొచ్చు. చూడముచ్చటైన రూపలావణ్యం, చలాకీ నటనతో ఈ భామ కుర్రకారులో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో ఈ సొగసరి సినిమాల కంటే సోషల్‌మీడియా ద్వారానే భారీగా డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలిసింది. శ్రీలీల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 17 మిలియన్ల ఫాలోవర్స్ ఉన్నారు. ఈ వేదికలో ఒక్క ప్రమోషనల్ పోస్ట్‌కు ఆమె 5 నుంచి 10 లక్షల వరకు ఛార్జ్ చేస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా నెలరోజుల్లో దాదాపు 50 లక్షల వరకు ఈ భామ ఆర్జిస్తున్నదని ఇండస్ట్రీ ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నది. సోషల్‌మీడియాలో బ్రాండ్ కొలాబరేషన్స్ ద్వారా పెద్ద మొత్తంలో ఆర్జిస్తున్న కథానాయికల్లో శ్రీలీల ఒకరని చెబుతున్నారు. మరి ఈ వార్తల్లో నిజమెంతో తెలియదు కానీ.. ట్రేడ్ వర్గాల్లో మాత్రం బాగా ప్రచారమవుతున్నది.

# బాక్సాఫీస్ షేక్ చేసిన 'లెనిన్'..

## -మొదటి రోజే రూ.16.7 కోట్లతో అఖిల్ సరికొత్త రికార్డ్!




అక్కినేని అఖిల్ హీరోగా వచ్చిన లేటెస్ట్ రూరల్ యాక్షన్ డ్రామా 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద అదిరిపోయే ఓపెనింగ్స్‌తో దూసుకుపోతోంది. మొదటి రోజే ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో, అఖిల్ కెరీర్‌లోనే బెస్ట్ ఫస్ట్ డే వసూళ్లను సొంతం చేసుకుంది. చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించిన వివరాల ప్రకారం ఈ చిత్రం మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 16.7 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి బాక్సాఫీస్ వద్ద ఘనమైన విజయాన్ని నమోదు చేసింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం ఈ సినిమాకు ఇండియా నెట్ కలెక్షన్స్ దాదాపు రూ. 5.90 కోట్లు, ఇండియా గ్రాస్ కలెక్షన్స్ దాదాపు రూ. 6.73 కోట్లు, అలాగే ఓవర్సీస్ గ్రాస్ కలెక్షన్స్ దాదాపు రూ. 3.00 కోట్లుగా వచ్చాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ సినిమాకు అత్యధిక వసూళ్లు వచ్చాయని, రెండు తెలుగు రాష్ట్రాల గ్రాస్ కలెక్షన్లే దాదాపు రూ. 6 కోట్ల వరకు ఉన్నాయని సమాచారం. అఖిల్ కెరీర్‌లో గత చిత్రాలతో పోలిస్తే 'లెనిన్' అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా నిలిచింది. కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో, థమన్ సంగీతంలో వచ్చిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించగా, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. మొత్తానికి అయ్యగారు ఈ చిత్రంతో గట్టి కంబ్యాక్ ఇచ్చారని అభిమానులు పండగ చేసుకుంటున్నారు. వీకెండ్ కావడంతో శని, ఆదివారాల్లో ఈ కలెక్షన్లు మరికొంత భారీగా పెరిగే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, Krishna, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450